క్లుప్తంగా

రోప్ స్కిప్పింగ్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ మైదానంలో నంద్యాల జిల్లాస్థాయి రోప్‌స్కిప్పింగ్ ఎంపిక పోటీలు బుధవారం జరిగాయి. జిల్లాలోని ప్రైవేటు, కేజీబీవీ, జిల్లా పరిషత్ పాఠశాల బాలబాలికలు 200 మంది పాల్గొన్నారు. పీఈటీ శాప్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల రవికుమార్ మాట్లాడుతూ అండర్-12, 14, 17, 19 కేటగిరీ విభాగాల్లో ఈనెల 29, 30 తేదీల్లో గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు.

రెండు రోజులుగా వీడని జల్లు

దొర్నిపాడు: తుపాను కారణంగా రెండురోజులుగా కురుస్తున్న జల్లులు రైతులకు ఊరటనిస్తున్నాయి. ప్రస్తుతం సాగుచేసిన మినుము, మొక్కజొన్న పంటలకు ఈ వాన ఎంతో మేలు చేకూరుస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

మోస్తరు వర్షం

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం మోస్తరుగా కురుస్తోంది. దీంతో ఆయా గ్రామాల కాలనీలు,అంతర్గత రహదారులు బురదమయమయ్యాయి. బుధవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉండింది. వర్షం లోనూ రైతులు,కూలీలు పొలాల్లో రసాయన ఎరువులు చల్లడం, పంటల్లో కలుపు మొక్కలు తొలగించడం వంటి పనులు చేస్తున్నారు.

ధరలు తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): పెరిగిన కూరగాయల ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో శ్రీనివాస సెంటర్‌లో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ పెంచిన నిత్యావసర సరుకుల, కూరగాయల, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కూరగాయల దండలు మెడలో వేసుకొని భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

మెస్ చార్జీలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): జగనన్న గోరుముద్ద పథకం మెస్ చార్జీలు పెంచి, నిత్యావసర సరుకులు ఉచితంగా ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకృష్ణ కోరారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శ్రీనివాసులు, ఆశా వర్కర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీగుర్రమ్మ పాల్గొన్నారు.

నేడు ఇంజేడులో 'జగనన్న సురక్ష'

ఉయ్యాలవాడ: మండలంలోని ఇంజేడు గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు.

గోస్పాడు: ఒంటివెలగల గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ భాస్కర్ బుధవారం తెలిపారు.

దొర్నిపాడు: స్థానిక సచివాలయం-1 లో గురువారం జగనన్న సురక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి బుధవారం తెలిపారు.

గడప గడపకు..

మండలంలోని దాకరాజువేముల గ్రామంలో గురువారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. బుధవారం నిర్వహించాల్సిన కార్యక్రమం రద్దు కావ డంతో గురువారం నుంచి కొనసాగుతుందని చెప్పారు.

పుస్తకాలు, సరుకులు అందజేత

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని బాలికల ఛాత్రాలయానికి బుధవారం పాఠ్యపుస్తకాలు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కొట్టె చారిట్రబుల్ ట్రస్టు తరఫున రూ.30వేలు విలువజేసే నిత్యావసర సరుకులు, పుస్తకాలను 40మంది బాలికలకు అందజేశారు.

పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

నంద్యాల: కోర్టు స్టే కారణంగా మిడుతూరు మండలం తలముడిపి గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని, వారికి వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శామూన్‌కు కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు.

సేవలు సక్రమంగా అందించాలి

గోస్పాడు: మాత శిశు సంరక్షణ సేవలు సక్రమంగా అందించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

జాబితా పకడ్బందీగా రూపొందాలి

ఆళ్లగడ్డ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పొరపాట్లకు తావివ్వకుండా ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలని తహసీల్దార్ హరినాథరావు ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బూత్ లెవెల్ ఆఫీసర్‌లకు ఇంటింటి సర్వేపై శిక్షణ నిర్వహించారు.

దరఖాస్తు చేసుకోండి

నంద్యాల(అర్బన్): నంద్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఒక మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త, ఐదు హెల్పర్ పోస్టులకు ఈనెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని నంద్యాల సీడీపీఓ చంద్రకళ బుధవారం తెలిపారు. పాణ్యం మండలం భూపనపాడులో మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ)కి రిజర్వ్ అయ్యిందన్నారు. హెల్పర్ పోస్టుల్లో పాణ్యం మండలం నెరవాడ (బీసీ-సీ), విశ్వనపురం ఓహెచ్ (ఆర్థో దివ్యాంగ, నంద్యాల మున్సిపాలిటీ), గడివేముల మండలం మంచాలకట్ట (ఈడబ్ల్యూఎస్) సరస్వతీనగర్ ఎస్టీ (నంద్యాల మున్సిపాలిటీ), పాణ్యం-2 ఓసీ మహిళలకు కేటాయించామన్నారు. కార్యకర్త పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండి 2023 జూలై నాటికి 21-35ఏళ్లలోపు ఉండాలన్నారు. ఆయా పోస్టుకు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, స్థానికంగా ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులను స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టులో అందజేయాలని సూచించారు.



అలమూరు సమీపంలో ఎద్దులతో పలక సేద్యం చేస్తున్న దృశ్యం



చిత్రేనిపల్లె వద్ద నారును కట్టలు కడుతున్న కూలీలు

విస్తారంగా వరి సాగు

- జోరుగా వరి నాట్లు
- బోరు బోవుల కింద పంట సాగు

రుద్రవరం: మండలంలోని అలమూరు,ముకుందాపురం,చిత్రేనిపల్లె,తండా,హరినగరం,నర్సాపురం, డీ.కొట్టాల తదితర గ్రామాల్లో బోరు బావుల కింద రైతులు వరి పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. 20 రోజుల క్రితమే రైతులు బోరు బావుల కింద నారు మడులు సిద్ధం చేయడంతో పాటు పొలాల్లో జీలుగలు చల్లారు. నారు నిక్కే సమయానికి జీలుగ ఏపుగా పెరగడంతో ట్రాక్టర్లతో బురద సేద్యం చేయిస్తున్నారు. సేద్యం పనులు పూర్తి కాగానే ఓ వైపు ఎద్దులతో పండ్లమాను, పలక సేద్యం చేయిస్తూ, మరోవైపు కూలీలతో నారును కట్టలుగా కట్టించి నాటు వేసేందుకు తరలిస్తున్నారు. అప్పటికే బురద సేద్యం పూర్తయిన మడుల్లో మహిళా కూలీలు నాట్లు వేస్తున్నారు. ఇలా..సేద్యం,నారు,వరి నాట్లు వేయించేందుకు ఒక్కో ఎకరాకు దాదాపు రూ.10వేల వరకు ఖర్చవుతోందని రైతులు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల పరిధిలో ఏటా బోరు బావుల కింద దాదాపు 450 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా ముందస్తుగా నాట్లు వేస్తున్నారు.



చిత్రేనిపల్లె నారు కట్టలను మడుల్లోకి లాక్కెళ్తున్న దృశ్యం



అలమూరు- చిత్రేనిపల్లె మధ్యనున్న పొలాల్లో వరి నాట్లు వేస్తున్న కూలీలు

కరోనా సమయంలో నిస్వార్థ సేవలు

ఈ చిత్రంలో లబ్ధిదారుడికి బియ్యం కూపన్లు అందజేస్తున్న వలంటీర్ పేరు రామాంజనేయులు. గోస్పాడు మండలం దీబగుంట్ల వాసి. గ్రామంలోనే విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈయన విధుల్లో చేరిన తొలినాళ్లలోనే కరోనా మొదలైంది. లాక్‌డౌన్, కరోనా విజృంభణతో జనం బయటకు రావడానికి జంకుతుండేవారు. అయినా ప్రభుత్వం అప్పగించిన తన పరిధిలోని 50 ఇళ్లకు సేవలందించాడు. ఫీవర్ సర్వే, కరోనా సోకిన వారి వివరాలు సేకరించి క్వారంటైన్ కేంద్రాలకు తరలించడం, మందుల పంపిణీ తదితర కార్యక్రమంలో ప్రాణాలకు తెగించి పాల్గొన్నాడు. ఇక దాతలు అందజేసే పండ్లు, కూరగాయలు, నిత్యావసర సరుకులను ఇంటింటికీ తిరిగి అందజేసేవాడు. ఆరోగ్య సంబంధ సమస్యలు తలెత్తితే వైద్య సిబ్బందిని తీసుకెళ్లడం, వారికి అవసరమైన మందులు తీసుకెళ్లి ఇచ్చి వారి తలలో నాలుకగా మారాడు. స్థానికులు నాడు ఆయన సేవలను అభినందించారు. - గోస్పాడు



బియ్యం కూపన్ అందజేస్తున్న వలంటీర్ రామాంజనేయులు

వలంటీర్ సేవలు మరువలేనివి



కరోనా కష్టకాలంలో మొదట్లో ఎంతో ఇబ్బందులు పడ్డాం. వలంటీరు రామాంజనేయులు విపత్కర సమయంలో కూడా ఇంటి వద్దకు వచ్చి మాకు అవసరమైన నిత్యావసర సరుకులు, రేషన్ కూపన్లు అందించేవాడు. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావడానికి జంకుతున్నా వలంటీర్లు నిర్భయంగా, ప్రాణాలకు తెగించి ఇంటింటికీ తిరిగి ప్రజల అవసరాలు తీర్చారు. అలాంటి సమయంలో ప్రభుత్వం అందించే పథకాలు మాకు సకాలంలో అందించాడు. ఆరోగ్య సమస్యలపై డాక్టర్లకు చూపించి మాకు ఇబ్బందులు లేకుండా చేశాడు. ఆయన సేవలను పొగడకుండా ఉండలేం.

- మస్తాన్, దీబగుంట్ల, గోస్పాడు

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి



ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): విద్యుత్ సిబ్బంది వర్షా కాలంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకవచ్చి వాటిని సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. నంద్యాల మండల పరిధిలోని గ్రామాల్లో నేలకు ఒరిగిన విద్యుత్ స్తంభాలను గుర్తించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావలి, ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ రమణమూర్తి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే ఆర్‌బీకేలు

నంద్యాల(అర్బన్): రైతుల సంక్షేమం కోసమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు.మండలంలోని పుసులూరు గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన ఆర్బీకేను బుధవారం రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్సిడీ ఎరువులను రైతులకు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్బీకేలో వ్యవసాయ రంగంలో విప్లవానికి శ్రీకారం చుట్టాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు అయిన ఆర్‌బీకే కేంద్రాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ పథకం ద్వారా నీటి నిల్వ చేసేందుకు సంప్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, సీనియర్ న్యాయవాది కృష్ణారెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పీపీ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ సుగుణశ్రీ ఎంపీపీ శెట్టి ప్రభాకర్, సర్పంచ్ రామసుబ్బయ్య, తిరుపాల్‌రెడ్డి, ఏఈఓ మణిమోహన్‌రెడ్డి, . ఏఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదలకు మేలు

- అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): పేదలకు మంచి చేయడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని దేవనగర్-1,2, రైతునగరం ప్రాంతాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రెండు శిబిరాల్లో సుమారు 4,050 దరఖాస్తులుకు 3,969 టోకన్లు జారీ చేయగా 3,860 దరఖాస్తులు నమోదయ్యాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ పరిధిలో నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరికీ అర్హత ఆధారంగా ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తున్నామన్నారు. సురక్ష క్యాంపుల ద్వారా 11రకాల సేవలను ఉచితంగా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి ధ్రువపత్రాలను అందించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఇటీవల ఓ మహిళా టీడీపీ నేత వలంటీర్ల పట్ల అనుచితంగా మాట్లాడడం బాధించిందన్నారు. వలంటీర్ వ్యవస్థతోనే కరోనా లాంటి విపత్కర సమయాన్ని సునాయసంగా దాటామని గుర్తుచేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ వలంటీర్లను దూషిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. వలంటీర్లు తమకు సంబంధించిన 50 గృహాల సమాచారాన్ని ఇతరులకు అందిస్తున్నారనే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా, వైస్ చైర్మన్ పాంశావలి, కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, చంద్రశేఖర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు శోభారాణి, ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, నాయకులు దేవనగర్‌బాషా, కారు రవికుమార్, జాకీర్‌హుసేన్, రవికిరణ్, ప్రదీప్‌రెడ్డి, సాయిరాంరెడ్డి, మోహన్, ఇమ్మానియేల్, తహసీల్దార్ శ్రీనివాసులు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ జయభారతరెడ్డి, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆర్.నాగులవరంలో ధ్రువ పత్రం అందిస్తున్న దృశ్యం

సంక్షేమ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష'

రుద్రవరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని అధికారులు తెలిపారు. మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు రవీంద్ర ప్రసాద్ జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆర్.నాగులవరం,టీ.లింగందిన్నె గ్రామాలకు చెందిన వారికి 233 ధ్రువ పత్రాలు అందజేశారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఆయా గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి కార్యక్రమంలో పాల్గొని ధ్రువ పత్రాలను అందుకున్నారు. ఏఓ శ్రీకృష్ణ, ఏఈలు వెంకటరాముడు,ప్రమోద్,ఏపీఓ ప్రతాప్, నాయకులు మోహన్‌రెడ్డి,లింగన్న,ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, వీరశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్రువపత్రాలు ఉచితంగా ఇచ్చారు



గతంలో ఏదైనా ధ్రువ పత్రాలు పొందాలంటే రెవెన్యూ, మున్సిపల్ కార్యాలయాల వెంట పనులు మానుకుని తిరిగాం. జగనన్న సురక్ష పేరుతో అధికారులు మా ఇంటి వద్దకే వచ్చి ఉచితంగా కేవలం రెండు రోజుల్లోనే ధ్రువ పత్రాలు అందజేయడం సంతోషంగా ఉంది. ఇంతకు ముందు ఇలా మాఇంటి వద్దకు వచ్చి అవసరాలు తెలుసుకొని ధ్రువ పత్రాలు ఇచ్చిన సందర్భం లేదు. గతంలో కుల, ఆదాయ పత్రాలకు కార్యాలయాల చుట్టూ తిరిగాం. ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు అవస్థలను తప్పిస్తాయి.

- వంగిశెట్టి వెంకటసుబ్బమ్మ, దేవనగర్, నంద్యాల

కుల, ఆదాయ, ఆరోగ్యశ్రీ కార్డులిచ్చారు



జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం నాకు కుల, ఆదాయ, ఆరోగ్యశ్రీ కార్డు అందజేశారు. మూడు రోజుల క్రితం వలంటీర్లు, అధికారులు మా వీధిలోకి వచ్చి మా అవసరాలను గుర్తించి అందుకు సంబంధించిన పత్రాలను తీసుకెళ్లి మూడు రోజుల్లోనే ధ్రువ పత్రాలు అందజేశారు. మొదట అధికారులు ఇంటికి వచ్చి చెప్పినప్పుడు మేం నమ్మలేదు. ఇలాంటి కార్యక్రమాలతో రూపాయి కూడా ప్రజలకు ఖర్చుకాదు. పనులు మానుకొని కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.

- పులి మద్దుల రమణమ్మ, దేవనగర్ నంద్యాల

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

నంద్యాల టౌన్: సీజనల్ వ్యాధుల లక్షణాలతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బుధవారం బ్రాహ్మణ కొట్కూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని పరిశీలించి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని రోగులను అడిగి తెలుసుకున్నారు.

చిన్నారులందరికీ టీకాలు వేయాలి

0 – 5 సంవత్సరాలలోపు వయసుగల చిన్నారులందరికీ టీకాలు కచ్చితంగా వేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ బుధవారం తెలిపారు. స్థానిక సర్వజన ఆసుపత్రిలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంపై ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

యాసిడ్ విక్రయాలపై అవగాహన

బొమ్మలసత్రం: పట్టణంలో యాసిడ్ విక్రయిస్తున్న వ్యాపారులకు డీఎస్పీ మహేశ్వరరెడ్డి బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు యాసిడ్‌ను విక్రయించే వారి వివరాలు అందజేయాలని సూచించారు. విక్రయాలు జరిపేటప్పుడు కొనుగోలుదారుల పేరు, సెల్ నంబర్లు తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వీడాలి

ఉయ్యాలవాడ : ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి అందే అర్జీల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది న్యాయం జరిగేలా చూడాలని తహసీల్దార్ రవికుమార్ సూచించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ స్థాయిలో పరిష్కారం కావలసిన సమస్యలు సైతం నేరుగా జిల్లా కలెక్టర్‌కు వెళ్లడం ఆక్షేపనీయమన్నారు. దీనిపై కలెక్టర్ పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా కొందరు అధికారుల్లో మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. సమస్యలు, అర్హులందరికీ పథకాలు అందించేందుకు మండల స్థాయిలో ఎంపీడీఓ, తహసీల్దార్, వ్యవసాయాధికారి, వైద్యాధికారి, ఎస్‌ఐ సభ్యులుగా కమిటీ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏపీఓ రవిప్రకాష్, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నకిలీ అగ్రిమెంట్‌తో బెదిరింపులు


బొమ్మలసత్రం: నకిలీ అగ్రిమెంట్‌తో పట్టణానికి చెందిన నాగమ్మను బెదిరించి ఆస్తిని కాజేయాలని చూసిన ఇద్దరు వ్యక్తులను వన్‌టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. బాలాజీ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటున్న హుసేన్‌తో పాటు పట్టణానికి చెందిన రామలింగేశ్వరరెడ్డి స్థానిక వన్‌టౌన్‌లో నివాసం ఉంటున్న నాగమ్మ ఇంటిపై కన్నువేశారు. నాగమ్మ కొన్ని రోజుల క్రితం మృతి చెందింది. కుమారుడు చిరంజీవి విదేశాల్లో ఉద్యోగం చేస్తూ స్థిరపడ్డాడు. నాగమ్మ తన ఇల్లు అమ్మినట్లుగా నకిలీ అగ్రిమెంట్‌ను తయారు చేసి చిరంజీవికి ఫోన్ చేసి నిందితులు బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో చిరంజీవి పట్టణంలో ఉన్న తన స్నేహితుడు సుదర్శన్‌కు విషయాన్ని వివరించి ఎస్పీకి ఫిర్యాదు చేయించాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

'ప్రిజం' భూములు రైతులకు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): కొలిమిగుండ్ల మండలం కలవటాల వద్ద ప్రిజం సిమెంట్ యాజమాన్యం ఫ్యాక్టరీ నిర్మిస్తామని రైతుల నుంచి సేకరించిన భూముల్లో ఇంత వరకు ఫ్యాక్టరీ నిర్మించలేదని, రైతుల భూములు తిరిగి ఇవ్వాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ 2008లో 400 మంది రైతుల నుంచి 1,420 ఎకరాలు సేకరించారని ఫ్యాక్టరీ నిర్మించలేదని, దీంతో భూములు బీడుగా మారాయన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యం..

నంద్యాలటౌన్: వైద్యుల నిర్లక్ష్యానికి వృద్ధురాలు చూపు కోల్పోయిన సంఘటన నంద్యాల సర్వజన ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఈ నెల 12న రుద్రవరం గ్రామానికి చెందిన అవుల లక్ష్మమ్మ అనే వృద్ధురాలు కుడి కంటి శుక్లం ఆపరేషన్ నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగంలో చేరింది. అదే రోజు ఆమెకు చికిత్స చేశారు. అయితే ఆమెకు కంటి సమస్య ఎక్కువ కావడంతో మరుసటి రోజు నంద్యాలలో ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఆమె కంటి చూపు పూర్తిగా కోల్పోయిందని చెప్పడంతో వారు విద్యార్థి, యువజన సంఘాలను ఆశ్రయించారు. దీంతో ఆంధ్రప్రదేశ్ డెమొక్రటిక్ విద్యార్థి, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్, రాయలసీమ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పూల వెంకట్, ప్రభుత్వ కంటి వైద్యురాలిని వివరణ కోరగా.. ఆమె దురుసుగా మాట్లాడుతూ వెళ్లిపోయింది. వారు వెంటనే ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మహబూబ్ బాషాకు సమస్యను వివరించి ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత వృద్ధురాలు నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ కంటి చూపు పోయిందనే విషయం తమ దృష్టికి వచ్చిందని వైద్యురాలిని సంజాయిషీ కోరామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

23న ప్రోత్సాహక బహుమతుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): ఇటీవల పదవ తరగతిలో ప్రతిభ చూపిన ముస్లిం విద్యార్థులకు ఈనెల 23వ తేదీన అంజుమన్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని అబ్దుల్‌కుద్దూస్ బుధవా రం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంజుమన్ షాదీఖానాలో ఆదివారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.3వేలు చొప్పున 230 మందికి చెక్కులు అందజేస్తామని పేర్కొన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని బైర్మల్ వీధిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని విక్రయదారుడిపై సెబ్ అధికారులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీలక్ష్మి మాట్లాడుతూ బుధవారం దాడులు నిర్వహించి 16 తెలంగాణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సీఐ లక్ష్మణ్‌దాసు నాయక్, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

విజయవంతం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 22, 23 తేదీల్లో కడప నగరంలో జరిగే పీడీఎస్‌యూ రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. షేక్ షాహిద్, వినోద్, నవీన్, గిరి, మనోహర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాటుపడాలి

దొర్నిపాడు:పగలు, ప్రతీకాలకు వెళ్లకుండా కలిసికట్టుగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎస్‌ఐ తిరుపాల్ సూచించారు. బుధవారం రాత్రి మండలంలోని దాకరాజువేముల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న విషయాలకు గొడవలకు పాల్పడితే భవిష్యత్ అంధకారం అవుతుందన్నారు. ముఖ్యంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ఆలయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

సేవా రంగ పరిశ్రమలకు ప్రోత్సాహమివ్వాలి

- 40 పరిశ్రమల యూనిట్లకు రూ.4.80 కోట్ల సబ్సిడీ మంజూరు
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలో ఉపాధి అవకాశాలు సృష్టించే సేవా రంగ పరిశ్రమలకు ప్రోత్సాహమివ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పరిశ్రమల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాస యాదవ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర, ఎస్సీ, ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రామలింగారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 40 సేవారంగ యూనిట్ల పరిశ్రమలకు రూ.4.80 కోట్లు సబ్సిడీ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తిరస్కరణకు గురైన 31 యూనిట్లకు సంబంధించి సంబంధీకులను కార్యాలయానికి పిలిపించి బ్యాంకింగ్ ప్రాసెస్‌పై అవగాహన కల్పించాలని ఆదేశించారు. వివిధ బ్యాంకుల్లో పెండింగ్ లో ఉన్న 69 దరఖాస్తుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఎల్డీఎం రవీంద్రకు సూచించారు. పెట్నికోట సమీపంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ వరకు అప్రోచ్ రోడ్ నిర్మాణానికి భూములను గుర్తించాలని చెప్పారు.

వలంటీర్ల సర్వే పరిశీలన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక 13వ వార్డు సచివాలయంలో 5 – 18సంవత్సరాల వయస్సు గల పిల్లల స్కూల నమోదు నిష్పత్తి సర్వేను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ బుధవారం పరిశీలించారు. వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లను విద్యాశాఖ అధికారులు సమన్వయం చేసుకొని వంశాతం జీఈఆర్ సాధించాలని ఆదేశించారు. అనంతరం రామకృష్ణ పీజీ కళాశాలలో ఐదు మండలాల సచివాలయ విద్య, సంక్షేమ సహాయకుల సమావేశం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ అధికారిణి చింతామణి, డీఈఓ సుధాకర్‌రెడ్డి, అలేస్కో రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ భవిష్యత్‌ను చూసుకోండి

దాగలమర్రి: సీఎం వైఎస్ జగనన్న అమలు చేస్తున్న పథకాలను పేరు మార్చి 5కోట్ల ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ ఇస్తామని చెప్పడం కాదని, ముందు టీడీపీ నాయకులు తమ పార్టీ భవిష్యత్ గురించి ఆలోచించుకోవాలని వైఎస్సార్‌సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, పార్టీ మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు సూచించారు. ఎంపీపీ స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంగళవారం నగళ్లపాడు గ్రామంలో 5కోట్ల ప్రజల భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి అఖిలప్రియ తమ నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం తగదన్నారు. గతంలో మీరు మంత్రిగా చేసినా.. నియోజకవర్గానికి ఎంత మేర నిధులు తెచ్చారు? ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డి గెలిచినప్పటి నుంచి ఇప్పటి వరకు చాగలమర్రి మండలంలో రూ.28.00 కోట్లతో అభివృద్ధి పనులు చేయించారన్నారు. పెద్దవంగలి గ్రామంలో రూ.4.30 కోట్లతో ప్రభుత్వ మైనారిటీ ఐటీఐ కళాశాల మంజూరు చేయించి శంకుస్థాపన చేశారన్నారు. రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్య పరిష్కారానికి రూ.1.30 కోట్లు మంజూరు చేయించారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మిమ్మల్ని, మీ పార్టీని ప్రజలు శాశ్వతంగా భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. గణేశ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, పెయింటర్ రఫీ, గేట్ల మాబు, సర్పంచ్ గోవిందయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు